'ఆయిల్‌పాం సాగు లక్ష్యాలు పూర్తి చేయండి'

అధికారులతో చర్చిస్తున్న రామచంద్రప్రసాద్

అశ్వారావుపేట, జూలై 2 : ప్రభుత్వం నిర్దేశించిన ఆయిల్‌పాం సాగు విస్తరణ లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అడ్వైజరీ కమిటీ సభ్యుడు ఆలపాటి రామచంద్రప్రసాద్ ఆయిల్‌ఫెడ్ డివిజనల్ ఆఫీసర్ ఆకుల బాలకృష్ణకు సూచించారు. నారంవారిగూడెం ఆయిల్‌ఫెడ్ డివిజనల్ కార్యాలయంలో మంగళవారం ఆయన ఆయిల్‌పాం రైతు సమస్యలపై అధికారులతో చర్చించారు. కనీస మద్దతు ధర టన్నుకు రూ.15 వేలు తగ్గకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. తోటల్లో దిగుబడి తగ్గుదలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాతావరణంలో మార్పుల వల్ల గెలల దిగుబడి తగ్గుతున్నదని, తోటల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఆశించిన దిగుబడి సాధించవచ్చని అధికారులు తెలిపారు. ఆయిల్‌పాం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి.. సాగుకు తోడ్పాటుగా ఉండాలని కోరారు. కొత్తగా ఆయిల్‌పాం సాగు చేసే రైతులకు కనీస అవగాహన కల్పించాలని, క్షేత్రస్థాయి సిబ్బందిని రైతులకు అందుబాటులో ఉంచాలని ఆయన సూచించారు.

రోజుకు 2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయాలి

- 13 లక్షల క్యూబిక్ మీటర్లు బీ తీయాలి
- వర్షాకాలంలో ఉత్పత్తి తగ్గకుండా చర్యలు తీసుకోవాలి
- అన్ని ఏరియాల జీఎంలకు సీఎండీ దిశా నిర్దేశం

మాట్లాడుతున్న సీఎండీ బలరాం

కొత్తగూడెం సింగరేణి, జూలై 2: వర్షాకాలంలో ఉత్పత్తికి విఘాతం కలగకుండా రోజుకు 2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయాలని, రోజుకు 13 లక్షల టన్నుల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగింపు చేయాలని సింగరేణి సీఎండీ బలరాం అన్ని ఏరియాల జీఎంలను కోరారు. మంగళవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో ఆయన సంస్థ డైరెక్టర్లు, ఏరియా జీఎంలతో ఉత్పత్తిపై, నూతన ప్రాజెక్టులు, అడ్రియాలా లాంగ్‌వాల్ ప్రాజెక్టు, ఇతర కంటిన్యూయస్ మైనర్లు పనితీరుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వర్షాకాలంలో ఉత్పత్తికి నష్టం వాటిల్లకుండా హాల్ రోడ్లను ఎప్పటికప్పుడు పటిష్ట పర్చుకోవాలని, క్వారీల్లో నిలిచిన వర్షపు నీటిని పంపింగ్ చేయాలన్నారు. ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవడానికి అన్ని ఏరియాలకు అవసరమైన యంత్రాలను, ఓవర్ బర్డెన్ తొలగించడానికి ఏజెన్సీల నియామకం లాంటివి పూర్తి చేశామని, ఏరియా యాజమాన్యాలు మరింత శ్రద్ధ వహిస్తూ లక్ష్యాల మేర బొగ్గు ఉత్పత్తి, బొగ్గుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డైరెక్టర్ (ఈఅండ్ఎం) సత్యనారాయణరావు, డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్‌వీకే శ్రీనివాస్, డైరెక్టర్ (పీపీ) వెంకటేశ్వర్‌రెడ్డి, జీఎం కో ఆర్డినేషన్ దేవేందర్, జీఎం రవికుమార్, కార్పొరేట్ ఏరియా జీఎంలు, వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అశ్రునయనాల మధ్య రైతు ప్రభాకర్ అంత్యక్రియలు

- ప్రొద్దుటూరులో విషాదచాయలు
- రైతు ఆత్మహత్యపై విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం : మంత్రి తుమ్మల
- రైతుకు న్యాయం చేయాలి : మాజీ మంత్రులు హరీష్‌రావు, కేటీఆర్


మృతుడి కూతురు, కొడుకుతో రోధిస్తున్న తండ్రి

చింతకాని/ మధిర/రఘునాథపాలెం, జూలై 2 : ఖమ్మంజిల్లా చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన రైతు బోజడ్ల ప్రభాకర్ అంత్యక్రియలు మంగళవారం ఆ గ్రామంలో అశ్రునయనాల మధ్య పూర్తయ్యాయి. ప్రభాకర్ తనకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ ఓ వీడియో తీసుకొని సోమవారం ఆత్మహత్యకు పాల్పడిన విషయం పాఠకులకు విదితమే. ఈ ఘటన ఖమ్మంజిల్లాలో సంచలనం కావడంతో స్వయనా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. సంబంధిత రైతు ఆత్మహత్యకు గల కారణాలను నివేదిక రూపంలో అందించాలని అధికారులను ఆదేశించారు. రైతు మృతి చెందడానికి కారణమైన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఖమ్మంజిల్లాకు చెందిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్రంలో విషాద పరిస్థితులు బాధాకరం.. : మాజీ మంత్రులు హరీష్‌రావు, కేటీఆర్

రాష్ట్రంలో రైతులు ఆత్మహత్య చేసుకునే విషాదకరమైన పరిస్థితులు దాపురించడం బాధాకరమని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో ఓ ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ రైతు ప్రభాకర్ తనకు అన్యాయం జరుగుతున్నదని పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసుకున్నా పట్టించుకోకపోవడమే ఆత్మహత్యకు ప్రధాన కారణమన్నారు. ఈ విషయంపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు తండ్రి ఫిర్యాదును తీసుకోవడానికి పోలీసులు వెనుకడుగు వేయడంపై మండిపడ్డారు. అదేవిధంగా రైతు ఆత్మహత్యకు కారకులైన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి కేటీఆర్ కూడా ట్విట్ చేశారు.

ప్రొద్దుటూరులో విషాదచాయలు..

మంగళవారం ఖమ్మం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం పూర్తి అయిన తర్వాత ప్రభాకర్ మృతదేహాన్ని స్వగ్రామం ప్రొద్దుటూరుకు తరలించారు. దీంతో ఒక్కసారిగా గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. ప్రభాకర్ మృతదేహం చుట్టూ తల్లిదండ్రులు బోజడ్ల పెద్దవీరయ్య–ఇందిరమ్మ, భార్య అనురాధ, ఇద్దరు పిల్లలు గ్రామస్తులంతా చేరి బోరున విలపించారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలంటూ ప్రభాకర్ తండ్రి కండువా కొంగు పట్టుకొని ప్రతిఒక్కరినీ ప్రాధేయపడిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. గ్రామంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

రైతు ఆత్మహత్యపై స్పందించని భట్టి

మధిర నియోజకవర్గంలో రైతు ఆత్మహత్య చేసుకున్నా డిప్యూటీ సీఎం, స్థానిక ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క స్పందించకపోవడంపై జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు మండిపడ్డారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ భట్టి ఎమ్మెల్యేగా ఉండడం మధిర ప్రజల దురదృష్టమన్నారు. భట్టి అనచరుల అరాచకాలతో అమాయక రైతు ఆత్మహత్యకు కారణమైందని అన్నారు.

10మందిపై కేసు నమోదు

బోజడ్ల ప్రభాకర్ ఆత్మహత్యకు కారకులైన 10మందిపై కేసు నమోదు చేసినట్లు ఖానాపురం హవేలీ సీఐ భానుప్రకాశ్ తెలిపారు. ప్రభాకర్‌కు భూమిని గత వారం అదే గ్రామానికి చెందిన మత్స్య సహకార సొసైటీ బాధ్యులతోపాటు కూరపాటి కిశోర్, పెంట్యాల రామారావు, గుర్రం నాగమల్లేశం, మొగిలి శ్రీను, మొగిలి ముత్తయ్య, వేల్పుల కాటయ్య, షేక్ సిద్దయ్య, వేల్పుల నర్సింహారావు, షేక్ సైదులు, మొగిలి మాధవరావు కలిసి ప్రొక్లైన్లు, డోజర్లతో వచ్చి చెరువులో కలిపారు. దీనిపై ప్రశ్నించిన ప్రభాకర్‌ను నీ పొలం చెరువులో కలిసింది. నీకు పొలం లేదంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో మనస్తాపం చెందిన ప్రభాకర్ సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి వీరభద్రయ్య ఫిర్యాదు మేరకు పదిమందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

'ధరణి' పెండింగ్‌లో ఉండొద్దు

- భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

ఆఫీస్ సబార్డినేట్ నుంచి వినతిపత్రం తీసుకుంటున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

దమ్మపేట, జూలై 2 : ధరణి దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉండొద్దని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదేశించారు. దమ్మపేట తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ధరణి పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష నిర్వహించగా.. 200 వరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. వీటిపై జాప్యానికి గల కారణాలు ఏమిటని ఆయన అధికారులను ప్రశ్నించారు. దరఖాస్తుల పరిష్కారంలో ఏమైనా సందేహాలుంటే తనను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. వారంలో పెండింగ్ దరఖాస్తులన్నీ పరిష్కారం అయ్యేలా చూడాలని ఆదేశించారు.

'మొక్కల' లక్ష్యాలను పూర్తి చేయాలి

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 2 (నమస్తే తెలంగాణ) : వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శాఖల వారీగా మొక్కలు నాటే లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణగౌడ్‌తో కలిసి మాట్లాడుతూ జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి వన మహోత్సవ లక్ష్యం 65.14 లక్షలు కాగా.. లక్ష్యాలను అధిగమించాలన్నారు. జిల్లాకు కేటాయించిన లక్ష్యం ప్రకారం మొక్కలు నాటేందుకు స్థలాలు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో విద్యాచందన, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'సంపూర్ణ అభియాన్'ను విజయవంతం చేయాలి

జిల్లాలో సంపూర్ణ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ జిల్లా, ఆస్పిరేషనల్ మండల కార్యక్రమంలో భాగంగా సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ప్రజలకు కావాల్సిన విద్య, వైద్యం, పౌష్టికాహారం, వ్యవసాయం, సామాజిక అభివృద్ధి తదితర అంశాల్లో జిల్లా, గుండాల మండల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. సంపూర్ణ అభియాన్ కార్యక్రమాన్ని జిల్లాస్థాయిలో ఈ నెల 4న, గుండాల మండలంలో 5న నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్డీవో విద్యాచందన, సీపీవో శ్రీనివాసరావు, మహిళా, శిశు సంక్షేమాధికారి విజేత, డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆ ఐదింటిని తెలంగాణలో కలపండి..

ఎమ్మెల్యే వెంకట్రావుకు ఐదు గ్రామాల ప్రజల వినతి

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఐదు గ్రామాల ప్రజలు

భద్రాచలం, జూలై 2 : రాష్ట్ర ఏర్పాటు సమయంలో ఆంధ్రాలో విలీనమైన ఐదు గ్రామపంచాయతీలను తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం మండలంలో కలపాలని కోరుతూ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుకు ఐదు గ్రామాల ప్రజలు మంగళవారం వినతిపత్రం అందజేశారు. గుండాల, పురుషోత్తపట్నం, యటపాక, పిచికలపాడు, కన్నాయిగూడెం గ్రామాలకు చెందిన ప్రజలు వినతిపత్రం అందజేసిన తర్వాత మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ నెల 6న హైదరాబాద్‌లో సమావేశమవుతున్న దృష్ట్యా ఆంధ్రాలో విలీనం చేసిన ఐదు గ్రామపంచాయతీల గురించి చర్చించాలని కోరారు. ఇటీవల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఐదు పంచాయతీలను తెలంగాణలో కలిపేందుకు సీఎం రేవంత్‌రెడ్డికి వివరించామని, దీనిపై త్వరలోనే సానుకూల స్పందన వస్తుందని తెలిపారని వారు గుర్తు చేశారు. ఐదు పంచాయతీలను కోల్పోవడంతో భద్రాచలం పట్టణ అభివృద్ధి కుంటుపడిందని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో జంగిలి సంపత్, నక్కా నర్సింహారావు, ఆవులూరి సత్యనారాయణ, రెడ్డిబోయిన సాయిబాబు, సూరిశెట్టి సత్యం, తోట రమేశ్, లంకపల్లి వెంకటయ్య, బేతి పాపారావు, రాసాల నర్సయ్య, జెట్టి రామకృష్ణ, రవి, బుర్రా రామకృష్ణ, పడిశిరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు జెడ్పీ స్థాయి సంఘాల సమావేశం

కొత్తగూడెం అర్బన్, జూలై 2 : భద్రాద్రి జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశం ఈ నెల 4న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో కె.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ చైర్మన్ చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన జరిగే ఏడు స్థాయి సంఘాల సమావేశానికి జడ్పీటీసీలు, జడ్పీ కోఆప్షన్ సభ్యులు, శాశ్వత ఆహ్వానితులు, జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

ఎస్సై శ్రీనుని పరామర్శించిన ఎస్పీ

కొత్తగూడెం క్రైం, జూలై 2 : ఆత్మహత్యాయత్నానికి పాల్పడి హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనుని జిల్లా ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు సోమవారం పరామర్శించారు. ఎస్సైకు మెరుగైన చికిత్స ఇవ్వాలని వైద్యులకు సూచించారు. అండర్ టేకర్ అనే గడ్డిమందు సుమారు 100 ఎంఎల్ తాగడం వల్ల అది శరీరంలో తీవ్ర ప్రభావం చూపుతోందని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం ఎస్సై శ్రీను పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు.

టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ సంయుక్త కార్యదర్శిగా కిరణ్‌కుమార్

వసికర్ల కిరణ్‌కుమార్

రామవరం, జూలై 2 : తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) కేంద్ర కమిటీ సంయుక్త కార్యదర్శిగా కార్పొరేట్ డివిజన్‌కు చెందిన వసికర్ల కిరణ్‌కుమార్‌ను నియమించినట్లు ఆ సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే కార్పొరేట్ ఉపాధ్యక్షుడిగా తుమ్మ శ్రీనివాస్, కార్యనిర్వాహక కమిటీ సభ్యుడిగా కనుకుంట్ల శ్రీనివాస్‌ను నియమించినట్లు పేర్కొన్నారు.

అదానీ-హిండెన్‌బర్గ్ మధ్యలో కొటక్!

హిండెన్‌బర్గ్‌కు సెబీ నోటీసులు

- అదానీ స్టాక్స్‌కు సంబంధించిన పెట్టుబడుల్లో నిబంధనల ఉల్లంఘన పేరిట సమన్లు జారీ
- కొటక్ బ్యాంక్‌ను పూర్తిగా రాయకపోవడంపై హిండెన్‌బర్గ్ ప్రశ్న
- మరో వ్యాపారవేత్తను రక్షించే చర్యలంటూ మండిపాటు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): అమెరికా షార్ట్ సెల్లింగ్ రిసెర్చ్ కంపెనీ హిండెన్‌బర్గ్, అదానీ గ్రూప్‌ల మధ్య ఏడాదిన్నర కాలంగా కొనసాగుతున్న వివాదం కీలక మలుపు తిరిగింది. అదానీ వివాదానికి సంబంధించి ఇండియా మార్కెట్ రెగ్యులేటర్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) హిండెన్‌బర్గ్‌కు గత నెల 27న 46 పేజీల షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు మంగళవారం హిండెన్‌బర్గ్ వెల్లడించింది. అదానీ స్టాక్స్‌పై పెట్టుబడుల్లో తాము నిబంధనల్ని ఉల్లంఘించినట్లు సెబీ నోటీసుల్లో పేర్కొన్నట్లు తెలిపింది. అయితే, ఈ వివాదంలో కొటక్ బ్యాంక్ ప్రస్తావనను హిండెన్‌బర్గ్ ఉటంకించడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

అసలేం జరిగింది?

అదానీ గ్రూప్ కంపెనీల్లో ఆర్థిక అవకతవకలు జరిగాయంటూ కిందటేడాది జనవరిలో హిండెన్‌బర్గ్ బాంబు పేల్చింది. దీంతో అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు భారీగా క్షీణించాయి. ఈ వివాదంపై దర్యాప్తు చేపడుతున్న సెబీ సుప్రీం కోర్టు ఆదేశాలమేరకు తాజాగా హిండెన్‌బర్గ్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అదానీ స్టాక్స్‌పై పెట్టుబడుల ద్వారా ఆ కంపెనీ 22.25 మిలియన్ డాలర్ల లాభాలు పొందిందన్నది.

అర్థంలేని నోటీసులు: హిండెన్‌బర్గ్

సెబీ షోకాజ్ నోటీసులను హిండెన్‌బర్గ్ 'అర్థంపర్థం లేనివి'గా కొట్టిపారేసింది. ఉద్దేశపూర్వకంగానే సెబీ ఆ నోటీసులను జారీ చేసిందని మండిపడింది. భారత్‌లోని శక్తిమంతమైన వ్యాపారవేత్తల లోపాలను ఎత్తిచూపే వారిని సెబీ బెదిరింపులకు గురిచేస్తుందని, ఇలాంటి చర్యలకు తాము భయపడబోమని స్పష్టం చేసింది. చిన్న మదుపర్లను రక్షించాల్సిన సెబీ అక్రమాలకు పాల్పడ్డ బడా వ్యాపారవేత్తలకు కొమ్ముకాస్తున్నదని తీవ్రంగా ధ్వజమెత్తింది.

సెబీ పేర్కొన్న లాభాలేమీ రాలే..

సెబీ ఆరోపించినట్టు అదానీ కంపెనీల షార్ట్ సెల్లింగ్ ప్రక్రియలో తమకు భారీ లాభాలేమీ రాలేదని హిండెన్‌బర్గ్ ఈ సందర్భంగా వెల్లడించింది. అదానీ షేర్ల షార్టింగ్ ద్వారా 4.1 మిలియన్ డాలర్ల స్థూల ఆదాయం పొందినట్టు, అదానీ అమెరికా బాండ్ల షార్ట్ ద్వారా మరో 31 వేల డాలర్లు లభించినట్లు వెల్లడించింది. ఖర్చులు పోను ఏమీ మిగల్లేదన్నది.

ఆరోపణలు అవాస్తవం: కొటక్

హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలపై కొటక్ బ్యాంక్ స్పందించింది. ఈ వ్యవహారంతో అసలు సంబంధం లేదని వెల్లడించింది. బ్యాంక్ ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ కింగ్డన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్‌కు హిండెన్‌బర్గ్ అసలు క్లయింటే కాదని పేర్కొంది. తమ ఫండ్‌లో హిండెన్‌బర్గ్ అసలు ఇన్వెస్టర్ కూడా కాదని స్పష్టంచేసింది. అయినప్పటికీ సంస్థ షేర్లు 4 శాతం నష్టపోయాయి.

'కొటక్' పేరు రాయరెందుకు?

సెబీ నోటీసులపై హిండెన్‌బర్గ్ స్పందిస్తూ 'కొటక్ బ్యాంక్' పేరును ప్రస్తావించడం ఇప్పుడు సంచలనంగా మారింది. బిలియనీర్ ఉదయ్ కొటక్ నేతృత్వంలోని కొటక్ బ్యాంక్ విదేశీగడ్డపై ఓ ఫండ్‌ను ఏర్పాటుచేసినట్లు ఈ సందర్భంగా హిండెన్‌బర్గ్ వెల్లడించింది. దాన్ని ఉపయోగించుకొని కింగ్డన్ క్యాపిటల్ అనే పెట్టుబడి భాగస్వామి ద్వారా అదానీ స్టాక్స్‌ను తాము షార్ట్ చేసినట్లు పేర్కొంది. ఇందులో కొటక్ మహీంద్రా ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ (కేఎంఐఎల్), కేఐవో ఎఫ్ సహకారం ఉన్నట్టు తెలిపింది. అయితే, సెబీ తమకు ఇచ్చిన నోటీసుల్లో ఎక్కడా కొటక్ పేరు గానీ, ఆ సంస్థ బోర్డు సభ్యుల ప్రస్తావన గానీ ప్రస్తావించలేదని మండిపడింది. కేఎంఎల్ఐ అంటూ పొడి అక్షరాలను వాడుతూ, కే–ఇండియా అపర్చునిటీస్ ఫండ్ లిమిటెడ్ అంటూ కొటక్ పేరు బయటకు రాకుండా సెబీ జాగ్రత్తలు తీసుకొన్నట్టు విరుచుకుపడింది.

ఫార్మా సదస్సుకు హాజరు కావాలని సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానిస్తున్న హెటిరో గ్రూప్ చైర్మన్ పార్థసారథి రెడ్డి, ఇండస్ట్రీ వర్గాలు

హైటెక్స్‌లో 5న భారతీయ ఔషధ సదస్సు

హైదరాబాద్, జూలై 2: ఈ ఏడాదికిగాను 73వ ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ వద్ద జరుగనున్నది. ఈ నెల 5–7 తేదీల్లో మూడు రోజులపాటు ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ ఈ సదస్సును నిర్వహించనున్నది. 'ప్రపంచ శ్రేయస్సు కోసం భారతీయ ఔషధ రంగ పాత్ర' అనే థీమ్‌తో ఈసారి సమావేశాలు జరుగుతున్నాయి. దాదాపు 9,000 మంది నిపుణులు, పరిశోధకులు, వ్యాపార, పారిశ్రామిక వర్గాలు, వివిధ కంపెనీల ప్రతినిధులు, ఎగ్జిబిటర్లు పాల్గొంటారని అంచనా. ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా కోరుతూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ అసోసియేషన్ ఆహ్వానించింది.

సీఎంతో నోకియా బృందం భేటీ..

నోకియా కంపెనీకి చెందిన ఓ ప్రతినిధి బృందం మంగళవారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా భేటీ అయ్యింది. వీరిలో నోకియా గ్లోబల్ హెడ్ మార్టిన్, సేల్స్ హెడ్ మ్యాన్క్, గ్లోబల్ డైరెక్టర్ వెంకట్‌తోపాటు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ ఉన్నారు. పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతోనూ భేటీ అయ్యారు.

వాణిజ్య

వెస్పా స్కూటర్ ధర 14.28 లక్షలు

న్యూఢిల్లీ, జూలై 2: దేశీయ మార్కెట్లోకి నయా వెస్పా అందుబాటులోకి వచ్చింది. లిమిటెడ్ ఎడిషన్‌గా విడుదలైన ఈ వెస్పా 946 డ్రాగన్ స్కూటర్ 155 సీసీ సామర్థ్యంతో తీర్చిదిద్దింది. కేవలం అంతర్జాతీయంగా 1,888 యూనిట్లు మాత్రమే విక్రయిస్తున్న ఈ మాడల్ ధర రూ.14,27,999(ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి)గా నిర్ణయించింది. భారత్‌లో ఎన్ని యూనిట్లు విక్రయిస్తున్న విషయాన్ని మాత్రం సంస్థ వెల్లడించలేదు. ఈ స్కూటర్ కోసం ముందస్తు బుకింగ్‌లు ఆరంభించింది కూడా సంస్థ. డ్యూయల్ చానెల్ ఏబీఎస్, 200 ఎంఎం డిస్క్ బ్రేక్ వంటి ఫీచర్స్‌తో రూపొందించిన ఈ స్కూటర్ యువతకు నచ్చుతుందని పేర్కొంది.

ఐసీఐసీఐ సఫిరో ఫారెక్స్ కార్డ్

విదేశీ విద్యార్థుల కోసం తెచ్చిన బ్యాంక్

న్యూఢిల్లీ, జూలై 2: దేశీయ ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ సంస్థ ఐసీఐసీఐ బ్యాంక్.. మంగళవారం ఓ ప్రీ–పెయిడ్ ఫారెక్స్ కార్డును పరిచయం చేసింది. ఉన్నత విద్యను అభ్యసించేందుకు విదేశాలకు వెళ్తున్న విద్యార్థుల కోసం 'సఫిరో' సిరీస్‌లో ఈ కార్డును బ్యాంక్ తీసుకొచ్చింది. చదువు సంబంధిత ఖర్చులను అధిగమించడానికి అటు విద్యార్థులతోపాటు ఇటు తల్లిదండ్రులకూ తమ ఈ కార్డు ఎంతో సౌకర్యవంతంగా, ప్రయోజనకరంగా ఉంటుందని ఈ సందర్భంగా ఐసీఐసీఐ బ్యాంక్ తెలిపింది. అడ్మిషన్ ఫీజులు, కోర్సు సంబంధిత చెల్లింపులతోపాటు ప్రయాణం, భోజనం, కిరాణా ఇతర రోజువారీ ఖర్చులకు సఫిరో ఫారెక్స్ కార్డు ఉపయోగపడుతుందని ఓ ప్రకటనలో బ్యాంక్ వివరించింది.

- ఈ కార్డు వినియోగదారులు 15 దేశాల కరెన్సీల్లో లావాదేవీలను ఎలాంటి చార్జీలు లేకుండానే చేసుకోవచ్చు.
- కేవలం ఒక్క కరెన్సీకి చెందిన నగదే ఉన్నా.. విద్యార్థులకు ప్రపంచవ్యాప్తంగా ప్రయాణించే వెసులుబాటు ఉంటుంది.
- కస్టమర్లకు ఒక ప్రైమరీ కార్డుతోపాటు ఓ రీప్లేస్‌మెంట్ కార్డును ఐసీఐసీఐ ఇస్తుంది.
- ప్రైమరీ కార్డు పోయినప్పుడు/పాడైపోయినప్పుడు ఐమొబైల్ పే, ఇంటర్నెట్ బ్యాంకింగ్ లేదా బ్యాంక్ కస్టమర్ కేర్‌కు ఫోన్ చేయడం ద్వారానైనా రీప్లేస్‌మెంట్ కార్డును యాక్టివేట్ చేసుకోవచ్చు.

హైదరాబాద్‌లో ఫినోమ్

హైదరాబాద్, జూలై 2: మానవ వనరుల సేవలు అందించే ఫినోమ్.. అమెరికా కేంద్ర స్థానంగా కార్యకలాపాలు అందిస్తున్న టైడీని హస్తగతం చేసుకున్నది. ఆర్థిక వివరాలు మాత్రం సంస్థ వెల్లడించలేదు. ఈ సందర్భంగా కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శివానంద్ మాట్లాడుతూ.. మానవ వనరులకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని వచ్చే రెండేండ్లకాలంలో మరో వెయ్యి మంది సిబ్బందిని నియమించుకోనున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రస్తుతం సంస్థకు హైదరాబాద్‌లో రెండు, వైజాగ్‌లో ఒక కార్యాలయం ఉండగా, వీటిలో 950 మంది వరకు విధులు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌తోపాటు వైజాగ్‌లో మరో కార్యాలయాన్ని ఏర్పాటు చేయబోతున్నది.

టారిఫ్‌లు పెంచినా జియో ప్లాన్లే చౌక

హైదరాబాద్, జూలై 2: దేశీయ టెలికం దిగ్గజాలైన జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు రీచార్జి ప్లాన్ల ధరలను పెంచుతూ టెలికం కస్టమర్లకు షాకిచ్చిన విషయం తెలిసిందే. గతవారంలో జియో తన ప్లాన్ల ధరలను 10 శాతం నుంచి 21 శాతం వరకు పెంచుతూ నిర్ణయం తీసుకోగా.. ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు కూడా ప్లాన్ల ధరలను 25 శాతం వరకు సవరించాయి. అయితే చార్జీలు పెంచిన తర్వాత జియో ప్లాన్లే చౌక ధరకు లభిస్తుండటం విశేషం. ఉదాహరణకు రోజుకు 1 జీబీ డాటా, అన్‌లిమిటెడ్ ప్లాన్ ధర రూ.249 కాగా, అదే ఎయిర్‌టెల్/వొడాఫోన్ ఐడియాలు రూ.299కి అందిస్తున్నాయి. అంటే 20 శాతం తక్కువ ధరకే లభిస్తుండటంతో రూ.50 ఆదా కానున్నది. అలాగే రోజుకు 2 జీబీ డాటా, అన్ లిమిటెడ్ కాలింగ్ ప్లాన్ జియో ర